రోడ్లపై మురుగు పరుగులు..

మన్సూరాబాద్ పరిధిలోని ప్రాంతాల్లో డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. జలమండలి, సీవరేజీ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేసిన స్పందించడం లేదని ఆయా కాలనీలవాసులు ఆరోపిస్తున్నారు. డివిజన్ పరిధిలోని సహారాస్టేట్స్‌కాలనీ వెనుకవైపు జడ్జెస్‌కాలనీలో గత కొన్ని రోజులుగా డ్రైనేజీ పొంగి రోడ్డుపై మురుగు ఏరులై పారుతున్నా పట్టించుకునే నాథుడే లేడని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మురుగులోంచి వచ్చే దుర్వాసనతో రోగాలబారిన పడుతున్నామని ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతాల వారు విజ్ఞప్తి చేస్తున్నారు. -మన్సూరాబాద్







పేరుకుపోతున్న చెత్త కుప్పలు..

హస్తినాపురం డివిజన్ పరిధిలోని నందనవనంకాలనీ, ఆదర్శ్‌నగర్, ఇంద్రసేనారెడ్డినగర్‌కాలనీ, భూపేశ్‌గుప్తానగర్‌కాలనీల్లో ఎటు చూసినా చెత్త కుప్పలే దర్శమిస్తున్నాయి. పేరుకుపోతున్న చెత్తను ఎప్పటికప్పుడు తరలించకపోవడంతో వర్షం కురిసినప్పుడు దోమలు, ఈగలు వ్యాప్తి చెందుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. వ్యర్థాల నుంచి వస్తున్న దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూపేశ్‌గుప్తానగర్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో సైతం భారీగా చెత్త కుప్పలు పేరుకుపోయాయి. శ్రీరమణకాలనీ, జిల్లా పరిషత్ రోడ్డు, షిర్డీ సాయినగర్ కాలనీ, హస్తినాపురం సెంట్రల్‌కాలనీ,హస్తినాపురం నార్త్ ఎక్స్‌టెన్షన్ కాలనీ తదితర ప్రాంతాలలోని రోడ్లు, బహిరంగ ప్రదేశాలలో చెత్త పేరుకుపోతున్నా పట్టించుకునే నాథుడే లేరని ఆయా ప్రాంతాల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. -హస్తినాపురం

ఆస్పత్రిలో రోగుల బారులు

గత కొంత కాలంగా విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. వైరల్ ఫీవర్, ఒళ్లు నొప్పులు, తదితర సమస్యలతో ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో వైద్యం కోసం వచ్చే రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. గతంలో రోజు 500 ఓపీ పేషెంట్లు వస్తుండగా, ప్రస్తుతం 700–800 మంది వస్తున్నారు. ఇందులో 50 నుంచి 60 మంది విషజ్వరాల బారిన పడగా అందులో దాదాపుగా 30 మంది వరకు డెంగీ పాజిటివ్ వస్తున్నట్లు డా.ఎస్.కృష్ణ వెల్లడించారు. విషజ్వరాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచిస్తున్నారు. -వనస్థలిపురం



అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి



రంగనాథ్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్

నాగోలు: కొత్తపేట డివిజన్ పరిధిలోని ఉన్నటువంటి మూసీ ప్రాంతం బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని మంగళవారం కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ మాట్లాడుతూ.. మహానగరంలో బఫర్ జోన్‌లో కబ్జాలకు గురైన వాటిపై హైడ్రా తీసుకుంటున్న చర్యలపై కార్పొరేటర్ పవన్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. కొత్తపేట డివిజన్ పరిధిలోని ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని తెలంగాణ పార్క్ శ్రీ రామలింగేశ్వర కాలనీ పక్కన సుమారు 3 ఎకరాల 12 గుంటల ప్రభుత్వ స్థలం ఉండేదని, కేవలం 19 గుంటలు మాత్రమే మిగిలిందన్నారు.ఆక్రమణలను గుర్తించి చర్యలు చేపట్టాలన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న విశ్వ బ్రాహ్మణ సంఘం నేతలు

పోస్టర్ ఆవిష్కరణ

మన్సూరాబాద్: విశ్వబ్రాహ్మణ సంఘం, రంగారెడ్డి జిల్లా సౌజన్యంతో సెప్టెంబర్ 17న ఎల్‌బీనగర్ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శ్రీవిరాట్ విశ్వకర్మ జయంతి యజ్ఞ మహోత్సవాలను నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు పులిగిల్ల శ్రీనివాసాచారి తెలిపారు. ఎల్‌బీనగర్‌లో మంగళవారం యజ్ఞ మహోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. విశ్వకర్మ భగవాన్ యజ్ఞ కమిటీ అధ్యక్షుడు మల్లోజు నరేష్‌చారి, ప్రధాన కార్యదర్శి నారోజు కొండలాచారి, కోశాధికారి చెన్నోజు సింహాద్రిచారి, ప్రచార కార్యదర్శులు పసునూరి నర్సింహాచారి, దేవరకొండ షణ్ముకచారి పర్యవేక్షణలో ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రసన్నాంజనేయస్వామి ఆలయ ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్ గుంటి లక్ష్మణ్, ఈఓ ప్రేమ్‌కుమార్, సంఘం సభ్యులు అందోజు దయానందుచారి, సత్యంచారి, నారోజు జగ్జీవన్‌చారి, వెంకటేశ్వరాచారి, యాదగిరిచారి, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు



కృష్ణాష్టమి వేడుకలో పాల్గొన్న శ్రీనివాస్‌యాదవ్

హస్తినాపురం: యాదవుల సంస్కృతి సాంప్రదాయాలను మరిచిపోకుండా ప్రతి యాదవ సోదరుడు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సహకరించాలని భూపేశ్‌గుప్తానగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, నల్ల పోచమ్మ దేవాలయ కమిటీ చైర్మన్ నారగోని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని భూపేశ్‌గుప్తానగర్ కాలనీ నల్ల పోచమ్మ దేవాలయంలో దేవాలయ కమిటీ, కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు, కృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించి చిన్నారులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు దండే వినయ్‌శాస్త్రీ, దండే అనిల్ శాస్త్రీ, యాదవ్ సంఘం ప్రతినిధులు గాలయ్య యాదవ్, మంధని మల్లయ్య యాదవ్, కాలనీ ప్రతినిధులు అనిమల్ల శంకర్, చిన్న మల్లేశ్‌గౌడ్, శ్రీధర్, జాలశివకుమార్ యాదవ్, రమేశ్‌యాదవ్, నగేశ్ యాదవ్, కందికంటి భరత్‌గౌడ్, కందకట్ల శివ కుమార్‌రెడ్డి, రొండి శ్రీనివాస్‌యాదవ్, రాజుయాదవ్ పాల్గొన్నారు.

కొత్తపేటలో..

నాగోలు: కొత్తపేట యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకులను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా, టీపీసీసీ ప్రచార కమిటీ కోకన్వీనర్ శ్రీవజీర్ ప్రకాష్ గౌడ్‌తో పాటు పలువురు యాదవ్ సంఘం నాయకులు పాల్గొని శ్రీకృష్ణుడికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ యాదవ్‌ను ఘనంగా సన్మానం చేశారు.

బీజేపీ మద్దతుతోనే కవితకు బెయిల్

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

మహేశ్వరం: బీజేపీ మద్దతుతోనే ఎమ్మెల్సీ కవితకు బెయిల్ వచ్చిందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కేఎల్లార్ మంగళవారం ఆరోపించారు. భవిష్యత్‌లో బీఆర్‌ఎస్, బీజేపీ రెండు ఒక్కటేనన్నారు. దానిని నిదర్శనమే కవితకు బెయిల్ రావడం అన్నారు. ఇటీవల పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి బీఆర్‌ఎస్ మద్దతు ఇవ్వడంతో 8 ఎంపీ స్థానాలు కాషాయ పార్టీ గెలుపొందిందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అన్ని రాష్ట్రాల ప్రభుత్వాధినేతల అవినీతిపై విచారణ జరుగుతుందని కేఎల్లార్ స్పష్టం చేశారు.

ఆర్థికసాయం అందజేత

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల గ్రామానికి చెందిన దార ఆగమయ్య గిరిజ దంపతుల నివాసం మూడు నెలల క్రితం విద్యుదాఘాతంతో పూర్తిగా దగ్ధమైంది. ఈ దంపతులకు మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం కింద మంజూరైన రూ.95 వేల చెక్కును మున్సిపాలిటీ కేంద్రంలోని ఆయన కార్యాలయంలో బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారి కుటుంబానికి తమ ట్రస్టు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు చెక్కును అందజేస్తున్న కేఎల్లార్

పేదలకు అన్యాయం చేయొద్దు

సరూర్‌నగర్ కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: పేద, మధ్య తరగతి కుటుంబాలకు అన్యాయం చేయవద్దని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి మంగళవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హైడ్రా ఒక డ్రామా కాదు అని అంటే సల్కమ్ చెరువులో ఒవైసీ బ్రదర్స్ నిర్మించిన కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. బడా బాబుల అక్రమాలు, భూ కబ్జాలు వదిలి పేదల జోలికి రావొద్దని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కోరామని తెలిపారు.

రైతు బజారులలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు.. టమాట రూ.17, వంకాయ రూ.23, బెండ రూ. 23, పచ్చిమిర్చి రూ. 13–35, కాకర రూ. 23, బీర రూ. 28, క్యాబేజి రూ. 15, ఫ్రెంచి బీన్స్ రూ. 60, క్యారెట్ రూ. 50, దొండ రూ. 18–21, చిక్కుడు రూ. 45, గోకర రూ. 23, బీట్‌రూట్ రూ. 25, క్యాప్సికం రూ. 47, ఆలు రూ. 38, దోస రూ. 15, సొర రూ. 11, పొట్ల రూ. 13, ఉల్లిగడ్డ రూ. 49, చామగడ్డ రూ. 40.
ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

నేడు డయల్ యువర్ డీఎం

నాగోలు: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలు, సలహాలు, సూచనలు తెలుసుకునేందుకు బండ్లగూడ డిపోలో బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మేనేజర్ వెంకటేశం ఓ ప్రకటనలో తెలిపారు. రవాణా సమస్యలు, సూచనలు తెలియజేయాలనుకునే ప్రయాణికులు బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటలకు 9959224058 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

నేడు ఎల్‌బీనగర్‌కు మందకృష్ణ మాదిగ రాక

నాగోలు: ఎల్‌బీనగర్‌లోని డా.అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ మహనీయుల విగ్రహాల వద్ద బుధవారం (నేడు) వికలాంగుల పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా సంఘం జెండాను మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరిస్తారని చైర్మన్ గోపాల్‌రావు, వైస్ చైర్మన్ అందె రాంబాబు, ఎల్‌బీనగర్ ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి బత్తిన సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ ఏబీసీడీ సుప్రీంకోర్టు ద్వారా విజయం సాధించిన మందకృష్ణ మాదిగకు ఎల్‌బీనగర్‌లో ఘన స్వాగతం పలుకుతున్నట్లు వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాజు, నరసింహా, హుస్సేన్ పాల్గొన్నారు.

మలక్‌పేట సర్కిల్-6 ఏసీపీగా గజానంద్

చాదర్‌ఘాట్: మలక్‌పేట సర్కిల్-6 అసిస్టెంట్ సిటీ ప్లానర్(ఏసీపీ)గా గజానంద్ బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన ఫర్హాద్ వరంగల్‌కు బదిలీపై వెళ్లగా ఎల్‌బీనగర్ సర్కిల్ కార్యాలయంలో పనిచేస్తున్న గజానంద్ మలక్‌పేటకు వచ్చారు.

జలమండలి డీజీఎం బదిలీ

చాదర్‌ఘాట్: మలక్‌పేట జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎస్.అభిలాష్ బదిలీపై సుంకిశాల ప్రాజెక్ట్‌కు వెళ్లారు. వినయ్‌నగర్ జలమండలి సబ్‌డివిజన్ డీజీఎం నాగరాజు ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించారు.బదిలీపై వెళ్లిన డీజీఎం అభిలాష్ గతంలో ప్రాజెక్ట్ కార్యాలయంలో పని చేశారు. ఇతనికి ఫీల్డ్‌వర్క్‌లో అనుభవం లేకపోవడం, నూతనంగా పనులు ప్రారంభించిన సుంకిశాల ప్రాజెక్ట్‌కు బదిలీ చేశారని ఉద్యోగులు తెలిపారు. నెలరోజుల్లోనే బదిలీ కావడంపై ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది.

ఇన్‌చార్జి డైరెక్టర్‌గా కాంతి వెస్లీ

చాదర్‌ఘాట్: రాష్ట్ర వికలాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమశాఖ ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా కాంతి వెస్లీ బాధ్యతలు తీసుకున్నారు. గతంలో పని చేసిన డైరెక్టర్ బి.శైలజ సెలవుపై వెళ్లడంతో ఇన్‌చార్జ్ బాధ్యతలు ఆమెకు అప్పగించారు. కాంతి వెస్లీ ఉమెన్స్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

చాదర్‌ఘాట్: గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మలక్‌పేట మెట్రో స్టేషన్ సమీపంలో ఓ వ్యక్తి (42) మృతి చెందినట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

సకాలంలో పనులు పూర్తి చేయాలి

ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని మలక్‌పేట ఎమ్మెల్యే బలాల ఆదేశించారు. మంగళవారం ఆయన పలు శాఖల అధికారులతో కలిసి అక్బర్‌బాగ్, సపోటాబాగ్, నల్లగొండ క్రాస్‌రోడ్, మాధవనగర్, ముంతాజ్ కాలేజ్ రోడ్డు ప్రాంతాలలో పర్యటించారు. ఎస్‌డబ్ల్యూజీ పైపులైన్ పనులు చేపట్టనున్న ప్రాంతాలను పరిశీలించారు. ముంతాజ్ కాలేజ్ రోడ్‌లో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేదని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై అధికారులు దృష్టిసారించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అనంతరం ఆయన డివిజన్ల వారీగా కొనసాగుతున్న పనులు, పెండింగ్‌లో ఉన్న పనులపై చర్చించారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ సయ్యద్ మినాజుద్దీన్, అధికారులు ఉన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలాల

కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు

లింగోజిగూడ: రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తున్న హైడ్రా కమిషనర్‌ను కలిసి మధ్య తరగతి కుటుంబాల జోలికి రావొద్దని కోరినందుకు లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డిని తపోవన్‌కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసి తపోవన్‌కాలనీ, గ్రీన్ పార్క్ కాలనీ, సింగరేని కాలనీలలో నివసించే వారంతా మధ్యతరగతి వారని వారి నివాసాలను కూల్చొద్దని విన్నవించడంతో పాటు తమ కాలనీలకు అండగా నిలుస్తున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డికి కృతజ్ఞతతో ఉంటారని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కే.మధు అన్నారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పేద మధ్య తరగతి ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, ప్రకాష్, ఐలయ్య, మహేశ్‌కుమార్, ప్రసాద్, నర్సింగ్‌రావు, పాపయ్య, చంద్రయ్య, రాజు, ఎం.కృష్ణ పాల్గొన్నారు.



కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డిని కలిసిన సంక్షేమ సంఘం ప్రతినిధులు

వసతుల కల్పనకు పెద్దపీట

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ 17వ డివిజన్‌లో సీసీరోడ్డు పనులను మేయర్ చిగురింత పారిజాత నర్సింహరెడ్డి స్థానిక కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్ని డివిజన్‌లలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయన్నారు. సీసీ, బీటీలతో పాటు యూజీడీలు, ఇతర మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పి.సుదర్శన్‌రెడ్డి, ఏఈఈ సాయిరాం, నాయకులు ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, కొలన్ కృష్ణారెడ్డి, బాల్‌నింగని జంగయ్య, టేకుల శశిధర్‌రెడ్డి, వంగేటి కొండల్‌రెడ్డి, తూళ్ల నరహరిగౌడ్, టేకుల సుధాకర్‌రెడ్డి, ఇక్కె శ్రీనివాస్, రాఘవరెడ్డి, సుధాకర్, మహిళలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



17వ డివిజన్‌లో సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న మేయర్ పారిజాత

బాలాపూర్‌లో గణేశ్ ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన..

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌లో ఏర్పాటు చేయనున్న గణనాథుని ఉత్సవాల నేపథ్యంలో రోడ్డు పనులు, పార్కింగ్ ఏర్పాట్లను అధికారులు మంగళవారం పరిశీలించారు. మేయర్ చిగురింత పారిజాత, బాలాపూర్ స్టేషన్ సీఐ భూపతి, కమిషనర్ రఘు, డీఈఈ జ్యోతిరెడ్డి తదితరులు తనిఖీ చేశారు. వినాయక చవితి కంటే ముందే ఏర్పాట్లు పూర్తి చేస్తామని మేయర్ పారిజాత వెల్లడించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ ప్రభాకర్‌రెడ్డి, ఏఈఈ సాయిరాం, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, నాయకులు జగన్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు కూల్చి వేయాలి



మీర్‌పేట: ఎంఐఎం నేతలు అక్రమంగా చెరువులను కబ్జా చేసి నిర్మించిన కట్టడాలను హైడ్రా ద్వారా ప్రభుత్వం వెంటనే కూల్చి వేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు కొలన్ శంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మీర్‌పేట జిల్లెలగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైడ్రా పేరుతో పేద ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే బీజేపీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా ప్రభుత్వం హైడ్రా పేరిట కాలయాపన చేస్తోందన్నారు. అదే విధంగా మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ నేత కిచ్చనగారి లక్ష్మారెడ్డి ప్రభుత్వ కార్యక్రమాల్లో తలదూరుస్తూ ఆటంకం కలిగిస్తున్నారని, అధికారులు తన మాటే వినాలని బెదిరింపులకు పాల్పడుతున్నాడని శంకర్‌రెడ్డి ఆరోపించారు. సమావేశంలో బీజేపీ మీర్‌పేట ప్రధాన కార్యదర్శులు సోమేశ్వర్, గాజుల మధు, శ్యామ్‌రాజ్ పాల్గొన్నారు.

జయకృష్ణకు సీఎం అభినందన

మహేశ్వరం: యూపీపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్‌లో ప్రతిభ కనబరిచి మెయిన్స్‌కు అర్హత సాధించిన గడ్డమీది జయకృష్ణను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం అభినందించారు. మండల పరిధిలోని తుమ్మలూరుకు చెందిన జయకృష్ణకు రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకం కింద రూ.లక్షల విలువైన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మంగళవారం గ్రామస్తులు జయకృష్ణను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు యాదగిరి, శ్రీశైలం, లింగారెడ్డి, చోటు, కార్తీక్ రెడ్డి, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జయకృష్ణకు చెక్కు అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

రక్తదానం ప్రాణదానంతో సమానం

జస్టిస్ చంద్రకుమార్

మన్సూరాబాద్: అన్ని దానాల కన్న రక్తదానం గొప్పదని, రక్తదానంతో ప్రాణదానంతో సమానమని జస్టిస్ చంద్రకుమార్ పేర్కొన్నారు. మదర్‌థెరిస్సా జయంతి సందర్భంగా తలసీమియా బాధితుల సహాయార్థం మదర్ థెరిస్సా చారిటబుల్ సొసైటీ అధ్యక్షుడు చేపూరి శంకరయ్య ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో బీఎన్‌రెడ్డినగర్‌లోని సెల్ఫ్ ఫైనాన్స్‌కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడారు. మనదేశంలో నిత్యం 1200 మంది తలసీమియా బాధితులకు సకాలంలో రక్తం అందక చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్యంగా ఉన్న యువతీ,యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

యువకుల రక్తదానం..

హయత్‌నగర్ : రక్తదానం ప్రాణదానంతో సమానమని అర్హులైన ప్రతి ఒక్కరు రక్తదానం చేసి తోటి వారి ప్రాణాలు కాపాడాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన పుట్టినరోజును పురస్కరించుకుని ఉప్పాల వెంకన్న మెమోరియల్ బ్లడ్ బ్యాంక్ సెంటర్ ఆధ్వర్యంలో బీడీఎల్ కాలనీలో తలసీమియా బాధితుల కోసం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. సమయానికి రక్తం అందక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని, వారిని రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తలసీమియా బాధితులకు తరచూ రక్త ఎక్కించాల్సి ఉంటుందని వారికోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.



రక్తదానం చేస్తున్న యువకులు

‘ఎన్ని కుట్రలు చేసినా కేసీఆర్‌ను భయపెట్టలేరు’

దిల్‌సుఖ్‌నగర్: బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఎన్ని కుట్రలు చేసినా కేసీఆర్‌ను భయపెట్టలేరని మహేశ్వరం నియోజకవర్గ బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ అన్నారు. మంగళవారం ఎమ్మెల్సీ కవితకు బెయిల్ రావడంతో ఆర్‌కేపురంలో స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇది మోసపూరితమైన కేసు అని మాజీ సీఎం కేసీఆర్ ముందే చెప్పారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆడుతున్న డ్రామా అని సుప్రీంకోర్టులో చూసిన వాదోపవాదనలు చూసిన తర్వాత కేసీఆర్ అన్నట్లు కవిత కడిగిన ముత్యం లాగా బయటికి వచ్చిందన్నారు. మహిళ అని కనికరం లేకుండా అనారోగ్యంగా ఉన్న కూడా ఐదు నెలలు కవితను ఇబ్బందులకు గురి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నగేష్, శ్రీనివాస్, శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, సాజిద్, శ్యామ్‌గుప్తా, మహేందర్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, పెంబర్తి శ్రీనివాస్, జగన్, దీపక్, మురళీధర్ రెడ్డి

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

మన్సూరాబాద్: శ్రావణమాసాన్ని పురస్కరించుకుని మన్సూరాబాద్ పోచమ్మ దేవాలయంలో మంగళవారం సామూహిక కుంకుమార్చన కార్యక్రమాలు శక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు మాజీ కార్పొరేటర్, ఆలయ కమిటీ చైర్మన్ కొప్పుల విఠల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పోచమ్మదేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ వైస్ చైర్మన్ పోచబోయిన గణేష్‌యాదవ్, నాంపల్లి శంకరయ్య, కృష్ణ, ఈశ్వర్ మహిళలు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్స్ గుర్తింపు కార్డులు తీసుకోవాలి

చాదర్‌ఘాట్: ట్రాన్స్‌జెండర్స్ తప్పనిసరిగా గుర్తింపు కార్డులను తీసుకోవాలని వికలాంగులు, ట్రాన్స్‌జెండర్స్ సంక్షేమశాఖ డైరెక్టర్ కార్యాలయం అధికారులు తెలిపారు. రాష్ట్రంలో 60 వేలకు పైగా ట్రాన్స్‌జెండర్స్ ఉన్నారని, అందులో 2వేల మంది గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోగా 1191 మందికి కార్డులు జారీ చేశామన్నారు. గుర్తింపు కార్డులతో ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలలో లబ్ధి పొందవచ్చన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

చంచల్‌గూడ: గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు యువకులను అరెస్టు చేసిన ఘటన మాదన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. యాఖుత్‌పురాకు చెందిన ఆసిఫ్ మహ్మద్ (18), సయ్యద్ ఆదిల్ (21), రెహ్మాన్ బిన్ అవద్ (18) గాంజా విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఐ వెంకటరమణ సిబ్బందితో కలిసి ఘటనా చేరుకుని తనిఖీలు చేయగా 265 గ్రాముల గంజాయి లభ్యమైంది. ఛావుని డబుల్ బెడ్రూమ్‌లో నివాసముండే రౌడీషీటర్ ఆనంద్ అగర్వాల్ వద్ద గంజాయి కొనుగోలు చేసి ఇతరులకు విక్రయిస్తున్నట్లు గుర్తించి ముగ్గురిపై కేసు నమోదు చేశారు.